TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 57 | ఆదివారం, జూన్ 9, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4




2వ పేజీలో...

బిఆర్ఎస్ పూర్తిగా చతికిల

## పడినట్లేనా ?

**పార్లమెంట్ ఫలితాల తరవాత కింకర్తవ్యం**

హైదరాబాద్, : పార్లమెంట్ ఫలితాల తరవాత తెలంగాణలో బిఆర్ఎస్ పూర్తిగా చతికిల పడినట్లే. ఊతకర్ర పట్టుకుని లేద్దామన్నా లేవలేని పరిస్థితి. కనీసం ఒక్కసీటు కూడా దక్కించుకోలేక పోయారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడో ఒకచోట గెలిచినా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తికి ఇవి అద్దం పట్టాయి. దీనికితోడు ఇక ముమ్ముందు అక్రమాలకు సంబంధించిన కేసులు కూడా వెన్నాడనున్నాయి. పార్టీలో ఉన్న కేడర్ కూడా ఇప్పటికిప్పుడు నమ్మి వెన్నంటి నడిచేంతగా పరిస్థితులు ఉండవు. ఫోన్ ట్యాపింగ్, భూ ఆక్రమణలు, ధరణి దగుల్బాజీ వంటి అక్రమాలన్నీ ఇక తన్నుకు వస్తాయి. కాళేశ్వరం అవినీతి కళ్లకు కనిపిస్తోంది.





మీడియా దిగ్గజం రామోజీ

# కన్నుమూత

హైదరాబాద్, : తెలుగు పత్రికా రంగంలో విప్లవం సృష్టించిన అక్షరం రాలిపోయింది. అనంతలో కాలకు ఎగిపోయింది. మహోన్నత పత్రికా సామ్రాజ్యాన్ని ప్రజలకు అందించిన రామోజీరావు అనంతలోకాలు వెళ్లిపోయారు. శనివారం తెల్లావారు జామున రామోజీరావు అస్తమయం చెందారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు.

2వ పేజీలో...

- అస్వస్థతలో ఆస్పత్రిలో తుదిశ్వాస
- ఫిలిం సిటీకి భౌతిక కాయం తరలింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం
- ఘనంగా నివాళి అర్పించిన ప్రముఖులు



ఇక పాలన పై

# శ్రద్ధ..

హైదరాబాద్,: ఎన్నికల కోడ్ ముగియంటంతో తెలంగాణ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంశాలలో ప్రాధాన్యతల ఆధారంగా ఒక్కొక్క దాని మీదా ముఖ్యమంత్రి, మంత్రులు దృష్టి సారిస్తున్నారు. సామాన్యులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఉద్దేశించిన ప్రజావాణి కార్యక్రమాన్ని శుక్రవారం తిరిగి ప్రారంభించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో గతంలో వాయిదా పడిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ఫైలును ఒకటి రెండు రోజుల్లో సీఎం క్లియర్ చేయనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్యులకు మెరుగైన సేవలు అందేందుకు 5 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. అలాగే రైతు రుణమాఫీ, ధరణి వంటి అంశాలతో బాటు రూ. 850 కోట్లతో రాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం, రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల సరఫరా వంటి ప్రాధాన్యతా అంశాలపై ప్రభుత్వం వడివడిగా నిర్ణయాలు తీసుకోనుంది.

2వ పేజీలో...



రామోజీ మృతికి చంద్రబాబు

## దిగ్భ్రాంతి

**మీడియా రంగంలో ఆయనది ప్రత్యేక శకం**
**అసామాన్య విజేత అంటూ చంద్రబాబు నివాళి**

అమరావతి, :ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.



నీట్ ఎగ్జామ్‌లో

## అవకతవకలు

**సమగ్ర విచారణ**
**జరపాలన్న కెటిఆర్**

2వ పేజీలో...

హైదరాబాద్, : నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. హై లెవల్ ఎక్స్ పర్ట్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన కీలకమైన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ ఎగ్జామ్‌లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనితో తోడు ఈ సారి చాలా మంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారు. నీట్‌లో (?4, -1) మార్కింగ్ విధానం ఉంటుంది. ఈ లెక్కన 718, 719 మార్కులు రావటమన్నది సాధ్యమయ్యే పనికాదన్నారు.



**ఆదిత్యానాథ్ దాస్ నియామకం**

**తెలంగాణ ప్రయోజనాలకు**

## గొడ్డలిపెట్టు

**మాజీ వ్యవసాయ శాఖ మంత్రి**
**సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

హైదరాబాద్ : తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి నుంచి ఆదిత్యానాథ్ దాస్‌ను తొలగించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశిస్తున్నాడు.. శిష్యుడు రేవంత్ పాటిస్తున్నాడని తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందే తెలంగాణపై చంద్రబాబు పెత్తనం మొదలైందనడానికి ఈ నియామకమే నిదర్శనం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన తెలంగాణకు రుణప...

2వ పేజీలో...



## కేటీఆర్ రాజీనామా..?

హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. స్వరాష్ట్ర సాధన కోసం 24 ఏళ్ల క్రితం పుట్టిన ఈ పార్టీ.. లక్ష్యాన్ని చేరుకుంది. పార్టీ అధినేత సకల జనులను ఏకం చేసి స్వరాష్ట్ర ఉద్యమం సాగించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ సాధించారు. 2014లో స్వరాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేశారు. ఉద్యమ నేతగా గులాబీ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. అక్కడి నుంచి గులాబీ నేతల్లో స్వార్థం మొదలైంది. తెలంగాణ ప్రయోజనాల కన్నా కుటుంబ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అయినా 2018 ముందస్తు ఎన్నికల్లోనూ మరోమారు అవకాశం ఇచ్చారు.

2వ పేజీలో...



## రామోజీ ఓ ధృవతార

రామోజీ వ్యక్తి కాదు..అనంతమైన శక్తి
స్వయంకృషితో పైకి వచ్చిన మహానుభావుడు
నివాళి అర్పించిన వెంకయ్య, జస్టిస్ ఎన్‌వి రమణ
రామోజీకి నివాళి అర్పించి దత్తాత్రేయ తదితరులు

3వ పేజీలో...

**హైదరాబాద్, : మీడియా దిగ్గజం రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసారు. రామోజీ ఫలిం సిటీకి చేరుకుని భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. అఖండమైన తెలుగు జ్యోతి ఆరిపోయిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఆయన రామోజీ ఫిలిం సిటీకి వెళ్లి రామోజీ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. రామోజీ రావు వ్యక్తి కాదని, శక్తివంతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. జీవితంలో స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించి మనకు దూరమయ్యారని తెలిపారు. ఓ ధృవతారగా వెలుగుతూ ఉంటా రని... ఆయన చేతలు, రాతలు, చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని భావిస్తున్నానని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. పత్రిక పెట్టిన నాటి నుంచి వారితో ఎంతో సన్నిహితంగా ఉండేవాడినని..**



3వ పేజీలో...

**ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపప్రసాదం ప్రారంభం**
**వివిధ రాష్ట్రాల నుంచి భారీగా ప్రజల రాక**

# ఇక పాలన పై శ్రద్ధ...

## మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత

మొదటిపేజీ తరువాయి...

1936, నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. చిననాటినుంచే విలక్షణ, సృజనాత్మకత కలిగిన ఆయన.. ఈనాడు దినపత్రికను ప్రారంభించి సంచలనం సృష్టించారు. 1974, ఆగస్టు 10న విశాఖపట్టణంలో ఈనాడును ప్రారంభించారు. అనంతరం సితార సినీ పత్రిక, ఈటీవీ చానళ్లను కూడా తీసుకొచ్చి మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా మొత్తాన్ని అక్కడే షూటింగ్ చేసుకునేలా సకల వసతులు కల్పించారు. ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం వ్యక్తం చెబుతున్నారు. రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించారని గుర్తుచేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సీడబ్ల్యూసీ సమావేశంలో కోసం రేవంత్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీచేశారు. ఇదిలావుంటే ఫిలిం సిటీకి తరలివచ్చిన ప్రముఖ నేతలు రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

## ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు

మొదటిపేజీ తరువాయి...

పదవిని లాగేస్తారన్న భయంతో చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటాడా? నాడు జలయజ్ఞం ప్రాజెక్టుల నుండి నిన్న పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యాదాస్‌ది కీలకపాత్ర. ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తికి తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలి. తెలంగాణ ప్రాజెక్టుల వ్యతిరేకిగా ముద్రపడ్డ వ్యక్తిని ఏ ప్రయోజనాల కోసం ఈ పదవిలో కూర్చోబెట్టారు? అని నిరంజన్ రెడ్డి అడిగారు. వ్యక్తిగతంగా ఒక ప్రభుత్వ అధికారిగా ఆయన పట్ల మాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ ఆంధ్రకు కృష్ణా ప్రాజెక్టుల నుండి నీటిని తరలించడంలో ఆయనది కీలకపాత్ర. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి గత పదేళ్లుగా ఆయన ఏపీ తరపున కొట్లాడిన వ్యక్తి ఆయన తెలంగాణకు న్యాయం చేస్తాడా? కేఆర్ఎంబీలో తెలంగాణ వాదనను తొక్కిపెట్టి ప్రాజెక్టుల మీద హక్కులు కోల్పోయేలా చేసిన వ్యక్తిని నియమించడం వెనక కాంగ్రెస్ ఆలోచన ఏంటి..? పోతిరెడ్డిపాడు, దుమ్ముగూడెం, రాయలసీమ ఎత్తిపోతల పథకాలతో తెలంగాణ నీటిని తరలించడంలోనూ ఆదిత్యాదాస్‌దే కీలకపాత్ర.. అలాంటి వ్యక్తి తెలంగాణ ప్రయోజనాల కోసం కృషిచేస్తాడా? తెలంగాణ ప్రాజెక్టులు, జల వనరుల మీద అపారమైన అనుభవం, అవగాహన ఉన్న ఎందరో జల నిపుణులు ఉన్నారు వారిని పక్కనపెట్టి తెలంగాణ కు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తిని ఎంచుకోవడం వెనక కారణాలేం టి..? కాంగ్రెస్ పాలనలో పాలమూరు మరోసారి ఎడారి అయ్యేలా ఉంది అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## గచ్చిరోలి ప్రాంతంలో మావోయిస్టుల క్యాంప్ ను చేధించిన పోలీసులు

బీజాపూర్ : ఛత్తీస్గఢ్ మొహల్లా మన్పూర్ దళం ఔంది దళం లో కొందరు సాయుధులైన మావోయిస్టులు మౌజా భీమన్మెజీ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని పక్కా సమాచారంతో మావోయిస్టు వ్యతిరేక ఆఫరేషన్ టీం గచ్చిరోలి,పోస్టు గారపట్టి, సిఆర్పిఎఫ్ 113 బెటాలియన్ అటవీప్రాంతాని చేరుకుంది. సుమారు మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో సైనికులకు మావోయిస్టు ల శిబిరం కనిపించడం జరిగిందని అది గమనించిన మావోయిస్టులు అక్కడ నుంచి తప్పించుకొని అడవుల్లో కి పరిగెత్తారు. వారికి సంబంధించిన సామాగ్రి అక్కడే వదిలేయడం జరిగింది. సోలార్ ప్లేటు చెప్పులు టెస్టర్లు ఆలివ్ గ్రీన్ దుస్తులు 2 తుపాకులు జర్మనీ కి చెందిన వాటర్ క్యాన్లు దుప్పట్లు బ్యాగులు మొదలైన సామాగ్రి వారి శిబిరం లో లభించినట్లు పోలీసులు తెలిపారు

రేవంత్ రెడ్డి సీఎం కాగానే.. ప్రజలు తమ సమస్యలు నేరుగా ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో కేసీఆర్ అధికారిక నివాసంగా ఉన్న ప్రగతి భవన్‌ను ప్రజలకు అంకితం చేస్తూ దానికి జ్యోతిబా పూలే పేరు పెట్టి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజలు నేరుగా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించారు. కోడ్ కారణంగా తిరిగి ఈ కార్యక్రమం శుక్రవారం నుంచి మొదలైంది. పెద్ద సంఖ్యలో ప్రజలు క్యూలు కట్టి తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్‌గా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.తొలుత.. ఈ జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో శుక్రవారం ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో ఇప్పటికే అధికారులు బదిలీలు, ప్రమోషన్ల ఫైలును ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపటం, శుక్రవారం దానికి ఆమోదముద్ర పడటంతో షెడ్యూల్ విడుదలైంది. నిజానికి 2023 ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, పదోన్నతుల విషయంలో టెట్ నిబంధన తప్పనిసరి అంటూ హైకోర్టు తీర్పు రావటం, జీవో 317 కారణంగా ఇతర జిల్లాల టీచర్లు రాజధాని పరిధిలోని రంగారెడ్డి జిల్లాకే రావటం ఎక్కువ కావటంతో స్థానికులమైన తమకు నష్టం జరుగుతోందని ఇక్కడి టీచర్లు హైకోర్టును ఆశ్రయించటంతో అప్పట్లో ఈ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ అరాకొరాగా జరిగింది. తీర్పు వచ్చేనాటికి వివాదం లేని బదిలీలు, ప్రమోషన్లు మాత్రం పూర్తయ్యాయి. అసంపూర్తిగా మిగిలిన ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ఆరంభించి పూర్తిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో 6 వేలమంది సెకండ్ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనుండగా, 2400 మంది హెడ్మాస్టర్లు కానున్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన మరో తీర్పును అనుసరించి 8,630 మంది భాషా పండితులకు, 1,819 మంది పీఈటీలు కూడా ఈసారి స్కూల్ అసిస్టెంట్లు కానున్నారు.వైద్యవిద్య, వైద్యవిధానపరిషత్, ప్రజారోగ్యశాఖలో 5348 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని రెండున్నర నెలల క్రితమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించగా, ఈ ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించింది. అయితే, కోడ్ కారణణంగా ఇది నిలిచిపోయింది. వైద్య, ఆరోగ్యసేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ ఎస్ఆర్‌బీ) ద్వారా పోస్టులు భర్తీ కానున్నాయి. కొత్త వైద్యకళాశాలలు రావడంతో పాటు వైద్య, ఆరోగ్య సేవలు జాప్యం లేకుండా పూర్తిస్థాయిలో అందించాలని జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) నిబంధనలు కఠినతరం చేయడంతో ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ ఉద్యోగాల భర్తీని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మొత్తం ఉద్యోగాల్లో 3235 పోస్టులు వైద్యవిద్య డైరెక్టరేట్ పరిధిలో ఉండగా, మిగిలిన 2,113 ఉద్యోగాలు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వైద్య విధాన పరిషత్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, ఔషధ నియంత్రణ మండలి (డీసీఏ), ఆయుష్, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి పరిధిలో ఉన్నాయి. వీటిలో 1610 వైద్యుల పోస్టులు, 596 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 1014 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 764 ల్యాబ్ టెక్నీషియన్, 191 ఫార్మసిస్టులు, 85 ఏఎన్ఎంల పోస్టులున్నాయి. పంద్రాగస్టులోగా ఒకేసారి రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసే దిశగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో సుమారు 30 లక్షల మందికి పైగా రుణమాఫీ చేయాల్సి ఉండగా, సగటున దీనికి రూ. 35 వేల కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వం ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పిటికే తమ ఆలోచనను ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకురావటమే గాక రుణమాఫీ కార్పొరేషన్ ఏర్పాటు కు రంగం సిద్ధంచేస్తోంది. ముందుగా బ్యాంకులను ఒప్పించి, వారి రుణాలను ప్రభుత్వ ఖాతాకు బదలాయించి, బ్యాంకుల నుంచి రుణ మాఫీకి సరిపడా మొత్తాన్ని తీసుకుని, ఆ బాకీని వడ్డీతో సహా నెలవారీ కిస్తీలుగా కట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల శాఖల ద్వారా వచ్చే ఆదాయాపు లెక్కల ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా, తెలంగాణలోని మొత్తం వ్యవసాయ భూమిలో దాదాపు 45 శాతం మేర సాగులోనే లేదని, అయినా రైతుబంధు సాయాన్ని గత ప్రభుత్వం విడుదల చేసిందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఈ వృధాను అరికట్టటం, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు అందించాల్సిన పంట సాయం, సబ్సిడీ

మొదటిపేజీ తరువాయి...

విత్తనాలు, పనిముట్లు, సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్ల మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించనుంది.రైతులు పండించే పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రేషన్ దుకాణాల ద్వారా వాటిని తక్కువ ధరకే అందించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. కేసీఆర్ హయాంలో బియ్యంతో బాటు ఒకటి రెండు సరకులకే పరిమితం కాగా, గత కాంగ్రెస్ ప్రభుత్వాల మాదిరిగి వీలున్నన్ని ఎక్కువ నిత్యావసరాలను సరఫరా చేయాలని, తద్వారా సామాన్యులపై నిత్యావసరాల భారాన్ని తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దీనిపై పౌరసరఫరా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఇందులో భాగంగానే ఇవాళ సెక్రటేరియట్‌లో ధరణి కమిటీ సమావేశం జరగనుంది. గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణిని రద్దుచేసి, భూరికార్డులను పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 'భూమాత' అనే వ్యవస్థను తీసుకురానుంది. దీనిపై పార్లమెంటు ఎన్నికలు ముగిసిన రెండవ రోజే ముఖ్యమంత్రి సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలోని సుమారు 436 కిలోమీటర్ల మేర ఉన్న రాష్ట్ర రహదారులను చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్ఐఎఫ్) కింద కేంద్రం గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేటాయించిన రూ.850 కోట్ల నిధులు బదిలీ అయినా.. అసెంబ్లీ ఎన్నికల హడావుడి, ఆ తర్వాత లోక్‌సభ కోడ్ కారణంగా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అయితే, అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను పరిశీలించిన ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో ప్రతి జిల్లాకూ సగటున రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు నిధులు దక్కనున్నాయి. జూన్ చివరికి టెండర్లు ఖరారుచేసి గుత్తేదారులతో ఒప్పందం చేసుకుని వేగంగా పనులు ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## రామోజీ మృతికి చంద్రబాబు దిగ్భ్రాంతి

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీలో ఉన్న చంద్రబాబు నేరుగా ఫిల్మ్‌సిటీకి చేరుకుని భార్యతో కలసి రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకం అని చంద్రబాబు కొనియాడారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి...ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారని అన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, ఆయన ఇక లేరు అనే విషయాన్ని తాము జీర్ణించుకోలేక పోతున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామోజీరావుతో తన 4 దశాబ్దాల అనుబంధాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు.. తనను ఆయనకు ఎంతో దగ్గర చేసిందని అన్నారు. సమస్యలపై పోరాటంలో ఆయన తనకు ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో తాను రామోజీ సూచనలు, సలహాలు తీసుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. రామోజీ అస్తమయంపై ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రబాబు ప్రార్థించారు.

## బిఆర్ఎస్ పూర్తిగా చతికిల పడినట్లేనా ?

మొదటిపేజీ తరువాయి...

దర్యాప్తు సంస్థలు ఇప్పటికే అవకతవకలు జరిగాయని ఘోషిస్తున్నాయి. ఈ సమసయంలో కాంగ్రెస్ను తిడుతుంటే కలసివచ్చేదేమీ లేదు. అలాగే ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా కదలలేని పరిస్థితి వస్తుంది. కేసుల నుంచి తప్పించుకునే వీలుండదు. తూఛ్ అని కొట్టి పారేయడానికి లేదు. కక్షసాధింపు చర్యలు అనడానికి కూడా లేదు. ఎందుకంటే అన్నీ కళ్లముందే కనిపిస్తున్నాయి. అధికారులను నమ్ముకుని, స్వార్థాన్ని జోడించి చేసే పాలన ఇలాగే ఉంటుంది. ఇకపోతే కెసిఆర్ హయాంలో కూడా సిఎంఒలో కార్యదర్శిగా పని చేసిన రాజశేఖర్ రెడ్డి వ్యవహార శైలిపై కూడా ప్రస్తుతం రాజకీయ అధికార వర్గాల్లో దుమారం రేగుతున్నది. రాజశేఖర్ రెడ్డి కూడా కెసిఆర్‌ను ప్రజా ప్రతినిధులకు దూరం చేశారని, ఏనాడు వారు ప్రజా సమస్యలతో ప్రగతి భవన్‌కు వస్తే వారిని కెసిఆర్‌తో కలిసే అవకాశం కల్పించే వారు కాదని మాజీ ఎంఎల్‌ఎలు అంటున్నారు. తమ అధినేతను కలిసే అవకాశం నిరాకరించడమే కాకుండా అపాయింట్‌మెంట్ పేరిట గంటల తరబడి నిరీక్షణకు గురి చేసేవాడని వారు చెబుతున్నారు. అధినేత భేటీకి ఈ అధికారే అడ్డుగా మారడంతో తమ సమస్యలే కాకుండా ప్రజా క్షేత్రంలోని నిజ సమస్యలు కూడా సిఎం దృష్టికి చేరేవి కాదని ఫలితంగా ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా అధికారం కోల్పోవలసి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి సిఎం కెసిఆర్‌కు నీడలా ఉండేవారు. ఆయన కేంద్రంలో మంత్రిగా పని చేసినప్పుడు కూడా రాజశేఖర్ రెడ్డి కెసిఆర్ పేషీలో నిర్ణయాత్మక పాత్ర వహించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కెసిఆర్‌కు చివరి దాకా వెన్నంటి ఉన్నారు. కాని ఇప్పుడు ఆయన వ్యవహార శైలిపై పలు రకాలుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ మూడు ప్రభుత్వాల పతనానికి సిఎంఒ అధికారుల వివాదాస్పద పాత్రనే పూర్తిగా కారణం కాకున్నా అనేక కారణాల్లో ఇదే బలమైన కారణమని వారు ఎన్నో సంఘటనలు ఉదహరిస్తూ చెబుతున్నారు. ఈ అనుభవాల ఫలితమో మరేమిటో గాని నాలుగో సారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టబోతున్న నారా చంద్రబాబు నాయుడు ఎంపిల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పరిపాలనకు కేంద్రమైన సిఎంఒలో బ్యూరోక్రాట్ల పాలన ఉండదని తానే అన్నీ ఇకపై చూస్తానని, వింటానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాననే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారిన చంద్రబాబును చూస్తారని అంటున్నారు. నిజానికి ముఖ్యమంత్రులుగా ఉన్నవారు ప్రజల మనసెరిగి పాలన సాగించాలి. అధికారుల పాత్రెంతవరకు అన్నది నిర్దేశించుకోవాలి. లేకుంటే ప్రజల్లో అభాసుపాలు కావడమే గాకుండా ఓటమి చెందుతారని గుర్తించాలి.

## బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు

### ఆయన లేరన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జనసేనాని

అమరావతి, : బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు లేరనే వార్త ఆవేదన కలిగించిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు.



అక్షరయోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాం÷–రతికి లోనయ్యానన్నారు. అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక.. కోలుకొంటారని భావించానని పవన్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనంగా మారిందని పవన్ తెలిపారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు.

ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారని పవన్ తెలిపారు. వర్తమాన రాజకీయాలపై, పాలన తీరుతెన్నులపై నిష్కర్షగా వార్తలను అందించడమే కాదని.. ఆ వార్తలను ఉషోదయానికి ముందే పాఠకుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం రామోజీరావు దక్షతను తెలియచేసిందన్నారు. ప్రజా ఉద్యమాలకు రామోజీ వెన్నుదన్నుగా నిలిచారని పవన్ అన్నారు. పత్రికాధిపతిగానే కాకుండా సినీ నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా విజయాలు సాధించారన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను వేదికగా చేశారన్నారు. మీడియా మొఘల్‌గా రామోజీరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. తను నమ్మిన సిద్దాంతాలకు కట్టుబడి ముందుకు వెళ్ళడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత సాధించారన్నారు. అక్షర యోధుడు రామోజీ రావు గారు అస్తమయం తెలుగు ప్రజలంద రినీ కలచి వేస్తోందన్నారు.

## నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలు

మొదటిపేజీ తరువాయి...

దీని గురించి ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని చెబుతున్నారు. కొంతమంది విద్యార్థులకు ఏకంగా 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం అవలంభించారన్నది చెప్పకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. నీట్ ఫలితాలను ప్రిపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం కూడా ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. అయితే నీట్ ఎగ్జామ్ విషయంలో బీఆర్ఎస్ తరపున పలు పశ్నలతో పాటు కొన్ని డిమాండ్లను కేటీఆర్ కేంద్రం ముందుంచారు. గత 5 ఏళ్లలో తెలంగాణ నుంచి ఏ విద్యార్థి కూడా నీట్‌లో టాప్ 5 ర్యాకింగ్‌లో లేరు. దీనికి కచ్చితంగా నీట్ ఎగ్జామ్‌లో జరుగుతున్న అక్రమాలే కారణమని మేము నమ్ముతున్నాం.గ్రేస్ మార్కుల కేటాయింపు కోసం అనుసరించిన విధానాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక ప్రామాణిక పద్ధతిలో ప్రతి విద్యార్థికి మేలు చేసేలా ఈ విధానం ఉండాలని బీఆర్ఎస్ కోరుతుంది.

కానీ 1500 మంది విద్యార్థుల గ్రూప్‌కు మాత్రమే మేలు చేసే విధంగా గ్రేస్ మార్కులు కలిపారు. అది సరైన విధానం కాదు. ఈ మొత్తం వ్యవహారంపై హై లైవల్ ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నీట్ ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలు, అక్రమాలను బయటపెట్టి అన్యాయం జరిగిన విద్యార్థులకు వారి కుటుంబాలకు న్యాయం చేయాలి.

## కేటీఆర్ రాజీనామా..?

మొదటిపేజీ తరువాయి...

ఆ తర్వాత కేసీఆర్, కేటీఆర్ అహంకారం తలకెక్కింది. దీంతో ఆ పార్టీకి మరో మారు అవకాశం ఇవ్వొద్దని యావత్ తెలంగాణ నిర్ణయించుకుంది2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. పదేళ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీ క్యాడర్ ఈ ఓటమితో కుంగిపోయింది. అయితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ ఓటమిపై సమీక్ష చేయలేదు. వైఫల్యాలను గుర్తించలేదు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిందని అదే అహంకారం ప్రదర్శించారు. ఆరు నెలల తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. కానీ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేయలేదు. ఉత్సాహం నింపే ప్రయత్నం చేయలేదు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలా మంది పార్టీని వీడారు. మిగతా వారు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు బాధ్యతలు తీసుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో ఈ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేదు. దాదాపు 17 స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది.అసెంబ్లీ ఎన్నికల తర్వాతనే కేటీఆర్‌పై ఒత్తిడి పెరిగింది. ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతల నుంచి తప్పుకుని మరోకరికి బాధ్యతలు అప్పగించాలని క్యాడర్ డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని సమీక్షలు పెడితే చెప్పాలని భావించింది. కానీ కేటీఆర్ సమీక్షలు చేయలేదు. ఓటమిని పట్టించుకోలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరింత దారుణంగా వచ్చాయి. దీంతో కేటీఆర్‌పై అసంతృప్తి తారాస్థాయికి చేరింది.పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నా కేటీఆర్ తమతో మాట్లాడే ప్రయత్నం చేయడం లేదన్న అసంతృప్తి బీఆర్ఎస్ క్యాడర్‌లో తమ ఆవేదనను సోషల్ మీడియా వేదికగా వ్యక్తం చేస్తోంది. కేటీఆర్ నిర్లక్ష్య వైఖరి, ఒంటెత్తు పోకడలే ఎన్నికల్లో పార్టీ తీవ్ర పరాభవం చవి చూసిందని పేర్కొంటున్నారు. ఇకనైనా ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. రాజీనామాపై ఒత్తిడి పెరుగుతుండటంతో కేటీఆర్ రాజీనామా చేస్తారా అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. నేతల ఒత్తిడితో తప్పుకుంటే.. పార్టీపై కేటీఆర్‌కు పట్టు సడలుతుంది. అలా కాదని పదవిలో కొనసాగితే తప్పుకోవాలన్న డిమండ్లు మరింత పెరుగుతాయి. అసంతృప్తులు పార్టీ వీడే అవకాశం ఉంటుంది.

## సంపాదకీయం

ఆదివారం, జూన్ 9, 2024

# భాషామ తల్లికి దేవులపల్లి సేవలు...!


తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష తెరమరుగు అవుతున్న సమయంలో, తెలుగు భాషను కాపాడిన స్వభాషాభిమానులలో దేవులపల్లి రామానుజరావు ఒకరు. జీవిత మంతా సాహితీ సేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి రామానుజరావు. విద్యార్థి దశ నుండే మాతృభాషపై మమకారం పెంచుకుని, తెలుగు భాషా వికాసానికి, ఔన్నత్యానికి పాటుపడిన ఒక గొప్ప సాహిత్యాభిమాని. నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచిన వారిలో రామానుజరావు ఒకరు. 1943లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్, 1956లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వంటి అగ్రగామి సంస్థల స్థాపనకు ఎంతో కృషి చేసి, జీవిత కాలమంతా సారస్వత పరిషత్ ఉపాధ్యక్షుడుగా, అధ్యక్షుడుగా ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంత రావు, బూర్గుల రామకృష్ణరావు. స్వామి రామానంద తీర్థ వంటి పెద్దలతో తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసారు. దేవులపల్లి రామానుజరావు వరంగల్ జిల్లా బొల్లికుంటలో 1917 ఆగస్టు 25న కలిగిన కుటుంబంలో జన్మించారు. డిగ్రీలో చేరేదాకా వరంగల్లులో, తర్వాత నిజాం కళాశాలలో, మధ్యలో కొంత విరామం తర్వాత నాగపూర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఉద్యోగం కోసం వెదకక, రాజకీయ, సాహిత్య రంగాల్లో కృషి చేశారు. సాహిత్య రంగంతోపాటు విద్యారంగం, గ్రంథాలయోద్యమం, విశ్వ విద్యాలయం, పత్రికా రచన, రాజకీయాలు, సహకారోద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, విశాలాంధ్రోద్యమం, రాజ్యసభ సభ్యత్వం- ఇలా తెలుగు వారి జీవితానికి సంబంధించిన సకల రంగాల్లోనూ ఆయన పాత్ర ఉంది. 1943 మే 23న ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తుతో ఆయనకు మొదటి నుంచి సంబంధం ఉంది. 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యుడిగా మొదలై, 1947లో కార్యదర్శి అయి, 1952లో తొలిసారి అధ్యక్షుడై మధ్యలో కొంత విరామం తప్ప జీవితం చాలించే దాకా ఆ సంస్థకు అధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగులో ప్రవేశ, విశారద లాంటి పరీక్షలు నిర్వహించింది. తెలుగు మాధ్యమంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తెలుగు అధ్యాపకుల కొరత తీర్చింది ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారే. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ప్రాథమికోపాధ్యాయులుగానూ, విశారద పరీక్ష పూర్తి చేసిన వారిని ఉన్నత పాఠశాల అధ్యాపకులుగా నియమించేవారు. ఈ పరీక్షలు తెలంగాణలోనే కాక, తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటిలో... బెంగళూరు, మైసూరు, హోసూరు, బొంబాయి, షోలాపూర్ వంటి అనేక ప్రాంతాల్లో నిర్వహించేవారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి పండిత శిక్షణను కూడా రామానుజరావు సారథ్యంలోని సారస్వత పరిషత్తే చేపట్టింది. అక్షరాస్యతా ప్రచారం, వయోజన విద్య కూడా పరిషత్తు కార్యక్రమాల్లో భాగం. 1953లో అలంపురంలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షిక సభల నిర్వహణ బాధ్యతను తలకెత్తుకున్నదీ ఆయనే. అప్పటి ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ సభలను ప్రారంభించడమే కాక రెండు రోజులూ వాటికి హాజరయ్యారు. ఆ సభల్లోనే తెలంగాణ రచయితల సంఘం దాశరథి అధ్యక్షులుగా, సి. నారాయణరెడ్డి కార్యదర్శిగా, శ్రీశ్రీ గౌరవాధ్యక్షుడిగా ఏర్పాటైంది. కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా 1957 నుంచి 1985 దాకా ఆయన జీవితంలో చాలా భాగం సాహిత్య అకాడమీతో ముడిపడింది. సాహిత్య అకాడమీ కార్యభారం మోసింది రామానుజరావే. అకాడమీ వృత్తి పదకోశాలు ప్రచురించడం, ప్రాచీన గ్రంథాలు ప్రచురించి చౌకగా అందుబాటు లోకి తేవడమూ ఆయన చలవే. సాహిత్య అకాడమీ నిర్వహణలో గానీ, సారస్వత పరిషత్తును నడపటంలో గాని రామానుజరావు తానే ఒక వ్యవస్థగా మారారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించినన్ని గ్రంథాలు దేశంలో మరే సాహిత్య అకాడమీ వెలువరించలేదు. ఉస్మానియా యూనివర్సిటీతో రామానుజరావుకు అమితమైన సంబంధం ఉంది. 1953 నుంచి 1976 దాకా సెనేట్, సిండికేట్ సభ్యుడిగా ఉన్నారు. 1972, 1973, 1975లో మూడుసార్లు తాత్కాలిక ఉపకులపతిగా వ్యవహరించారు. 1960 నుంచి 1962 దాకా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. నాడు తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక విశ్వ విద్యాలయం ఉస్మానియా. తెలుగు భాషకు ద్రోహం చేస్తూ, ఉర్దూను కృత్రిమత్వానికి గురిచేస్తూ కొందరు స్వార్థ పరులు ఉస్మానియాను హిందీ యూనివర్సిటీగా మార్చి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని ప్రయత్నాలు చేశారు. ఉన్న ఒక్క విశ్వవిద్యాలయమూ పోయే పరిస్థితి ఎదురైనప్పుడు పౌర సంఘాన్ని ఏర్పాటు చేసి పోరాడి ఉస్మానియాను తెలుగువారికి దక్కించడంలో రామానుజరావు అద్వితీయ కృషి చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభలు అతి వైభవంగా జరిగాయి. ఈ సభం రూపకల్పనలో రామానుజరావు పాత్ర ప్రమేయం, ప్రాతినిధ్యం ప్రముఖం.

# సముద్ర కాలుష్యాన్ని నివారించాలి



మానవజీవితం నీటితో ముడిపడి ఉన్నది. జీవులు ధ్భవించింది, పరిణ మించింది నీటి ఆధారంగానే. ప్రపంచం మొత్తం మహాసముద్రాల బలం మీదనే ఉందని మనకు ఇప్పటికే తెలుసు, భూమిలో 70 శాతం మహా సముద్రాలు ఉన్నాయి. మహా సముద్రాలు మన జీవితాన్ని మాత్రమే కాకుండా మొత్తం భూమి, పర్యావరణాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. భూమిపై లభించే మొత్తం నీటిలో 97 శాతం మహా సముద్రాలలో ఉంది. మనం ఊపిరి పీల్చు కోవాల్సిన ఆక్సిజన్లో 70 శాతం మహా సముద్రాల ద్వారా ఉత్పత్తి అవుతుంది. జీవుల శరీరము లో 70-80 శాతము నీరే ఉంటుంది . సముద్ర సంపదను తన ఆర్థిక ప్రగతికి పునాదిగా మార్చుకున్నాడు మనిషి. నేడు ఒక అంచనా ప్రకారము ప్రపంచ జనాభా లో 25% సముద్రతీర ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. నీరులేనిది జీవుల మనుగడ ఉండదు ... ఏప్రాణీ బ్రతకదు. సాగర జీవసంపద విశేషమైనది. సాగరంలో దొరికే జీవ సంపదలో ప్రధాన స్థానము చేపలదే. తరువాత తాబేళు , తిమింగళాలు, సీల్సు, మున్నగు నవి. సముద్ర తీరాన్ని ఆధారముగా చేసుకొని లభించే పక్షిజాతి అనేకము. ఇవి కాక కోరల్స్, మత్యాల నిచ్చే ఆల్చిప్పలు మున్నగునవి. సముద్రంలో పనికిరాని పదార్థము లేదు. ఆ వైద్యపరంగా వాడుతారు. సముద్రాలలో గ్యాస్ లభిస్తుంది. ప్రపంచ సముద్ర దినోత్సవం ప్రతి ఏటా జూన్ 8న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. సముద్ర రక్షణ గురించి ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. 1992 లో బ్రెజిల్ లోని రియోడి జనీరోలో ధరిత్రి సదస్సు జరిగింది. ఆ సందర్భముగా సముద్రాలమీద అవగాహన పెంచాలని నిర్ణయించారు. నాటి వరకు తుఫాన్ లును మాత్రమే చూసిన తీర ప్రజలకు 2005 లో వచ్చిన సునామీ... అది సృష్టించిన బీభత్సం తర్వాత ఇక సాగర దినోత్సవం ద్వారా సముద్రాల మీద ప్రజల ఆలోచనలను మార్చాల్సిన అవసరము ఉందని తీర్మానించు కున్నారు. 2008 లో ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానం ద్వారా 2009 నుండి ప్రపంచ సాగర దినోత్సవ నిర్వహణ ప్రారంభ మైంది. నాటి నుండి ప్రతియేటా జూన్ 08 న " సముద్ర/ సాగర దినోత్సవం" గా జరుపు కుంటున్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం" మహా సముద్రాలు సంబంధిత విషయాలు, ఆహార భద్రత, జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత, సముద్ర వనరులు వినియోగం, వాతావరణ మార్పు మొదలైన వాటి యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకో వడానికి ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ఇంటర్నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆర్గనైజేషన్ వారు జలభాగాన్ని మొత్తం ఐదు మహాసముద్రాలు గా విభజించారు. ఐదు మహా సముద్రాలతో కలిసి మొత్తం 100 నుండి 110 సముద్రాలను గుర్తించ వచ్చును. వీటిలో అట్లాంటిక్ లో అత్యధికంగా 40, ఫసిఫిక్ లో 33, ఆర్కిటిక్ లో 17, అంటార్కిటిక్ లో 11, హిందూమహా సముద్రములో 9 ఉన్నాయి. భూగోళము మీద మూడింట రెండు వంతులు మేర సముద్రము ఆవరించి వుంది. విస్తారమైన ఉప్పునీటి భాగాన్నే సముద్ర మంటారు. మానవులు వినియోగించే అధిక శాతం ప్రోటీన్లు సముద్ర జీవులైన చేపలు, రొయ్యలు మొదలగు మత్స్యసంపద ద్వారా వస్తున్నదే. వాతావరణంలో మార్పులను మానవ నివాసానికి అనుకూలముగా మారుస్తున్నది సముద్రాలే. మానవులకు నీటివనరులను అందించే వర్షాలు కురిసేది సముద్ర జలాలు నీరు ఆవిరవడంవలనే. గాలి విస్తున్నది. ఉష్ణోగ్రతను నియంత్రిస్తున్నది సముద్రాలే. మనిషి సహజ వాయువు, ముడి చమురు నిక్షేపాలును సముద్ర గర్భము నుండే పొందుతున్నారు. సముద్ర జీవులను ఆహార, ఔషధ తయారీ లో వినియోగించడం జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ వాణిజ్యంలో 80% ప్రజలకు మరియు సమాజానికి అంతర్జా తీయ షిప్పింగ్ ఉపయోగ పడుతుంది. మహా సముద్రాలైనా, సముద్రాలైనా వాటికుండే ప్రత్యేక లక్షణం నిరంతర చలనం. సముద్ర జలాలు ఒక్క క్షణము కూడా నిలకడగా ఉండవు. నిరంతరం ఏర్పడే అలలు అంతు చిక్కని లోతు సముద్ర జలాల ప్రత్యేకతలు. సూర్య చంద్రుల ఆకర్షణ శక్తి వల్ల సముద్రపు నీరు పైకి లేస్తుంది. అలా లేచిన నీటిని భూమి ఆకర్షణ శక్తి తనవైపు ఆకర్షిస్తుంది. అందువల్ల ఆ నీరు క్రమంగా ఒక అల రూపంలో సముద్రతీరం వైపు సాగుతూ వస్తుంది. సముద్రాలు, మహా సముద్రాలు, చిన్న నీటి వస్తువులు భూమిపై జీవనానికి ఆధారం. అవి లేకుండా ఆధునిక నాగరికత అసాధ్యం. మానవుడు సముద్రాలను చాలా చక్కగా ఉపయోగిస్తాడు. నీటి ఉ ఉపరితలంపై పదివేల నౌకలు ప్రయాణిస్తాయి, సైనిక జలాంత ర్గాములు నీటి కింద ఉన్నాయి. ప్రతిరోజూ వేలాది టన్నుల చేపలను లోతుల నుండి తీసి, సముద్రపు అడుగుభాగం నుండి చమురు బయటకు పంపుతారు. నీటి ఉపరితలంపై ఏదైనా పరికరాల పని ఎగ్జాస్ట్ వాయువుల ఉద్గారంతో పాటు, తరచూ వివిధ సాంకేతిక ద్రవాల లీకేజీతో కూడి ఉంటుంది. ఉదాహరణకు, ఇంధనం. అదనంగా, వ్యవసాయ క్షేత్రాలకు శుద్ధి చేయడానికి ఉపయోగించే రసాయనాలు, సమీపంలోని విశ్రాంతి గృహాల నుండి మురుగు నీరు మరియు చమురు ఉత్పత్తులు క్రమంగా సముద్రాల లోకి వస్తున్నాయి. ఇవన్నీ చేపల మరణానికి, నీటి రసాయన కూర్పులో స్థానిక మార్పులు మరియు ఇతర అవాంఛనీయ పరిణామాలకు దారితీస్తుంది. నీటి వనరులను నీటిని పొంద టానికి మాత్రమే కాకుండా, రవాణా, పారిశ్రామిక మరియు వైద్య ప్రయో జనాల కోసం కూడా ఉపయోగ పడుతుంది. భూమి యొక్క నీటి వనరులను ఉపయోగించే ప్రక్రియలో, చాలా హాని కలుగుతున్నది. సముద్రాలకు జరిగే ప్రధాన నష్టం కాలుష్యం. ఏదైనా సముద్రా నికి కాలుష్యానికి ప్రత్యేకమైన, స్థిరమైన మూలం ప్రవహించే నదులు. అనేక నగరాల గుండా వెళుతున్న నీరు కాలువలు, నదుల ద్వారా అదనపు కాలుష్యంతో సముద్రాలలో కలుస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా, మిలియన్ల క్యూబిక్ మీటర్ల రసాయనాలు, ఇతర ద్రవ వ్యర్థాలు సముద్రాలలో చేరుతున్నాయి. ప్రస్తుతానికి మానవ అవసరాలకు, అనియంత్రిత చమురు తీయడం సమస్య తీవ్రంగా ఉంది. ఇది సముద్ర జీవులకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుంది. అలాగే, కొన్ని జాతుల చేపలు (ప్రధానంగా ట్యూనా చేపల కుటుంబం నుండి) క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నాయి, ఎందుకంటే అవి యూ. ఎన్. గణాంకాల ప్రకారం 90% వద్ద పట్టుబడు తున్నాయి. సముద్ర జలం వల్ల లబ్ధిపొందు తూన్న మానవుడు తాను కలిగిస్తున్న నష్టం గురించి గాని, సముద్ర జలాలలో వస్తున్న మార్పును అంతగా పట్టించు కోవడంలేదు. తన చర్యల వల్ల కాలుష్యము అధికమై భూతాపము పెరిగి ధృవాలలోని మంచు కరిగిపోతుందని సముద్రమట్టము పెరుగుతుందని గమనించి, మానవుడు మేల్కొనక తప్పదు. నేటి వరకు పర్యావరణమంటే అడవులు, నదుల వరకే అనుకుని వాటికి సంబంధించిన అవగాహన మాత్రమే కల్పిస్తున్న అంతర్జాతీయ సంస్థలు సముద్ర జలాల గురించి ప్రజలకు తెలియ చెప్పాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

## దెబ్బకు దెబ్బ అంటున్న పుతిన్!



తమ భూభాగాలపై దాడులు చేసేందుకు పశ్చిమ దేశాలు ఆయుధాలను ఇస్తే వాటిపై దాడులకు తాము కూడా ఇతరులకు అస్త్రాలను అందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ హెచ్చరించాడు. తామిచ్చిన ఆయుధాలను ఆత్మరక్షణతో పాటు రష్యా మీద ఎదురుదాడులు చేసేందుకు సైతం వినియోగించుకోవచ్చని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు పవర్ పట్టా ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ సంక్షోభంలో పశ్చిమ దేశాల కారణంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కరీబియన్ ప్రాంతంలో మిలిటరీ విన్యాసాలు జరిపేందుకు రష్యా వైమానిక, నౌకా దళం వెళుతున్నట్లు అమెరికా అధికారులు చెప్పారు. పశ్చిమ దేశాల చేతిలో కీలుబొమ్మగా మారిన ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ తమ పౌరులను అష్టకష్టాలకు గురిచేస్తున్నాడు. పశ్చిమ దేశాల కుట్రను తమ భూభాగం మీద సాగనివ్వను అనే ఒక్క హామీని ఇచ్చి ఉంటే రష్యా మిలిటరీ చర్య అసలు జరిగి ఉండేదే కాదు. శాంతి సభ పేరుతో ఉక్రెయిన్‌కు మద్దతుగా పశ్చిమ దేశాలు తలపెట్టిన సమావేశాన్ని దెబ్బ తీసేందుకు రష్యాకు సాయం చేస్తున్నట్లు జెలెన్‌స్కీ చైనా మీద ఆరోపణలకు దిగటం అర్ధరహితం. తమ సార్వభౌమత్వానికే ముప్పు తలెత్తితే అణ్వాయుధాలను ఉపయోగించేందుకు కూడా వెనుకాడబోమని, నాటో కూటమి దేశాలపై దాడులకు వీలుగా తమ దగ్గర ఉన్న దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఇతర దేశాలకు అందచేస్తామని సెంట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల సందర్భంగా ప్రతినిధులతో పుతిన్ చెప్పాడు. పశ్చిమ దేశాల ఇటీవలి చర్యలు ఉక్రెయిన్ పోరులో ప్రత్యక్షంగా పాల్గొనటమేనని, అదే పద్ధతిలో వ్యహరించే హక్కును తాము అట్టిపెట్టుకుంటామని అన్నాడు. అమెరికా జనాలు ఎవరిని ఎన్నుకున్నా వారితో కలసి పని చేస్తామని, ఎన్నికల తరువాత ఏదో మార్పు వస్తుందని తాము అనుకోవటం లేదన్నాడు.

# దెబ్బకు దెబ్బ అంటున్న పుతిన్!

ఇతెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేథో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు. ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు. దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచర్య- శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన. మూడు కావ్యేతిహాసాలను - శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భాగవతము, వేదాలు - ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఓకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతికృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు.



నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా. పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు.

### రామోజీ రావు మృతి పత్రిక రంగానికి

# తీరని లోటు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న టిడిపి నాయకులు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** ఈనాడు పత్రిక అధినేత రామోజీ రావు ఆకస్మిక మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు అన్నాడి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద రామోజీరావు మృతికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. రామోజీ రావు పత్రిక అధినేత గా ,వ్యాపార దిగ్గజం అని,రామోజీ ఫిలింసిటీ నిర్మించి హైదరాబాద్ కు ప్రపంచపటంలో ఒక గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎల్లోజి,యువత నాయకులు వెంకటేష్, ఎండీయాష్,కరీం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ షెటర్లకు వేలం పాట

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ముందు గల లక్ష్మి నరసింహ దుకాణ సముదాయ షెట్టర్లకు ఈనెల జూన్ 12 వ తేదీ బుధవారం రోజున వేలం నిర్వహించ ఉన్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి పీవీ నరసింహారెడ్డి తెలిపారు. గన్నేరువరం మండల పరిధిలోని 16 గ్రామాల నుండి ఎవరైనా ఆశావహులు వేలంపాటలో పాల్గొన వచ్చని తెలిపారు. గన్నేరువరం గ్రామపంచాయతీ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు. 17 షెట్టర్లకు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పదివేల రూపాయల డిపాజిట్ చెల్లించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారికి కేటాయిస్తామని తెలిపారు. వేలంలో దుకాణాలు పొందినవారు మూడు నెలల కిరాయిని ముందు చెల్లించాలని తెలిపారు.



## ఘనంగా శివాజీ మహారాజు విగ్రహావిష్కరణ

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** గన్నేరువరం మండల పరిధిలోని చీమలకుంటపల్లి గ్రామంలో ఆరే క్షత్రీయసంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మరాఠా యోధుడు శ్రీ శ్రీ శివాజీ శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆరె సంఘం పెద్దలు శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ అతి కొద్ది మంది సైన్యంతో గెరిల్లా యుద్ధ రీతిలో పోరాటం చేసి అఖండ సామ్రాజ్యాన్ని స్థాపించిన మహానుభావుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు.యువత శివాజీ ని స్పూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు.శివాజీ మహారాజ్ విగ్రహాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసుకోవడం సంతోషకరం అన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో అద్యక్షులు మర్ధనపేట నరేష్ , శ్రీకాంత్ , సంతోష్, శ్రీనివాస్, రవీందర్, శ్రీను, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల ఆరె క్షత్రీయ కులబాంధవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీట్ అభ్యర్థుల గ్రేస్ మార్కులపై సమీక్ష

న్యూఢిల్లీ : నీట్ యుజి వైద్య ప్రవేశ పరీక్షలో ఇతోధిక మార్కుల కేటాయింపుపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులపై సమీక్షకు నలుగురు సభ్యుల బృందాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిందని జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఎ) శనివారం ప్రకటించింది. పరీక్ష నిర్వహణ, గ్రేస్ మార్కుల కేటాయింపులో అవకతవకలు ఏవీ జరగలేదని ఎన్‌టిఎ స్పష్టం చేసింది. ఎన్‌టిఎ పాఠ్యపుస్తకాల్లో చేసిన మార్పులు, పరీక్ష కేంద్రాల్లో సమయం నష్టానికి గ్రేస్ మార్కులు ఇవ్వడం విద్యార్థులు అధిక మార్కులు పొందడం వెనుక కారణాలని ఎన్‌టిఎ వివరించింది. ఈ వివాదం రాజకీయ మలుపు కూడా తీసుకున్నది. అవకతవకల ఆరోపణలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సిట్ దరాయప్తు జరిపించాలని ఆప్ కోరింది. పేపర్ లీక్‌లు, రిగ్గింగ్, అవినీతి అనేక పరీక్షల్లో అంతర్భాగంగా మారాయని కాంగ్రెస్ ఆరోపించింది. బిజెపి యువజనులను వంచిస్తోందని, వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని కూడా కాంగ్రెస్ ఆరోపించింది. ఆరు పరీక్ష కేంద్రాల్లో సమయం నష్టాన్ని భర్తీ చేయడానికి గ్రేస్ మార్కులు కేటాయించడం విపరీత స్థాయికి మార్కులు చేరడానికి దారి తీసిందని, ఇతర అభ్యర్థుల అవకాశాలను దెబ్బ తీసిందని ఆరోపిస్తూ తిరిగి పరీక్ష నిర్వహించాలని పలు వర్గాల నుంచి డిమాండ్లు వచ్చాయి. ఆ కేంద్రాలు మేఘాలయ, హర్యానాలోని బహదూర్‌గఢ్, ఛత్తీస్‌గఢ్‌లోని దాంతెవాడ, బలోథ్, గుజరాత్‌లోని సూరత్, చండీగఢ్. వైద్య ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 4న ప్రకటించారు. పరీక్షలో 67 మంది అభ్యర్థులు మొదటి ర్యాంకు పంచుకున్నారు. వారిలో హర్యానాలోని ఒకే కేంద్రం నుంచి ఆరుగురు కూడా ఉన్నారు. '1500 మందికి పైగా అభ్యర్థుల ఫలితాల సమీక్ష నిమిత్తం ఒక ఉన్నతాధికార కమిటీ ఏర్పాటైంది. యుపిఎస్‌సి మాజీ చైర్మన్ సారథ్యంలోని నలుగురు సభ్యుల బృందం ఒక వారంలోగా తన సిఫార్సులు సమర్పిస్తుంది. ఆ అభ్యర్థుల ఫలితాల సమీక్ష జరగవచ్చు' అని ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్ ఢిల్లీలో విలేకరుల గోష్ఠిలో తెలియజేశారు. 'గ్రేస్ మార్కుల కేటాయింపు పరీక్ష అర్హత నిబంధనను ప్రభావితం చేయలేదు. బాధిత అభ్యర్థుల ఫలితాల సమీక్ష అడ్మిషన్ ప్రక్రియను ప్రభావితం చేయదు' అని ఆయన స్పష్టం చేశారు. నీట్ యుజి 2024 ఫలితాల్లో విపరీత స్థాయిలో మార్కులు వేయడం ఈ ఏడాది వైద్య కళాశాలలో సీటు సాధన మరింత కష్టం కావచ్చునని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫలితాలను రద్దు చేసి, తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరేందుకు కొందరు అభ్యర్థులు ఆన్‌లైన్ వేదికలను ఆశ్రయించారు. కొందరు విద్యార్థులకు పరీక్షను తిరిగి నిర్వహిస్తారా అని ప్రశ్నించగా, కమిటీ సిఫార్సులను బట్టి దానిని నిర్ణయిస్తారని ఎన్‌టిఎ డిజి సమాధానం ఇచ్చారు. 'సమయం కోల్పోయిన విద్యార్థులు లేదా ఇతర విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి గురి కాకుండా చూడడమే ఉద్దేశం' అని ఆయన చెప్పారు. ఏ పేపరూ లీక్ కాలేదని, పరీక్షలు అవకతవకలు జరగలేదని సింగ్ స్పష్టం చేశారు. ఈ కీలక పరీక్ష సమగ్రతపై రాజీ పడలేదని ఆయన పునరుద్ఘాటించారు. వైద్య కోర్సులకు జాతీయ పరీక్ష సాధికారతపై ఈ ఫలితాలు ఆందోళనలు లేవనెత్తాయని కేరళలో కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ప్రక్రియపై అనేక మంది విద్యార్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని పార్టీ తెలిపింది. 'ఇందుకు మోడీ ప్రభుత్వం నేరుగా బాధ్యురాలు. నియామక పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు పెక్కు అవకతవకలను ఎదుర్కొనడం, పేపర్ లీక్‌ల సంక్షోభంలో చిక్కుకోవడం వారి భవిష్యత్తుతో ఆడుకోవడమే.

## ఇండియా కూటమి సంఘటితంగా వ్యవహరించాలి



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల తీర్పు విభజనవాద, విద్వేష రాజకీయాలకు 'నిర్ణయాత్మక తిరస్కరణ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ఢిల్లీలో పార్టీ కార్యవర్గం (సిడబ్లుసి) సమావేశంలో స్పష్టం చేశారు. ఇండియా కూటమి పార్లమెంట్‌లోను, వెలుపలా సంఘటితంగా వ్యవహరిస్తూనే ఉండాలని ఖర్గే నొక్కిచెప్పారు. ప్రతిపక్ష నాయకుని పాత్ర పోషించాలని రాహుల్ గాంధీకి కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు కూడా. ఖర్గే సిడబ్లుసి సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ, పార్టీ ఒక వైపు 'పునరుత్థానాన్ని' వేడుక చేసుకుంటూనే, మరొక వైపు ఒకింత ఆత్మావలోకనం చేసుకోవాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో పార్టీ ప్రదర్శన తన సామర్థ్యానికి, అంచనాలకు తగినట్లుగా లేదని ఆయన చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌పై తమ విశ్వాసాన్ని తిరిగి వ్యక్తం చేశారని, 'నిరంకుశ శక్తులకు', రాజ్యాంగం వ్యతిరేకులకు వారు గట్టి సమాధానం ఇచ్చారని ఖర్గే ఉద్ఘాటించారు. 'అధికార పార్టీ నియంతృత్వ, ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులకు వ్యతిరేకంగా ప్రజలు మాట్లాడారు. గడచిన పది సంవత్సరాల రాజకీయాలకు అది కచ్చితమైన తిరస్కరణ. విభజనవాద, విద్వేష రాజకీయాలకు తిరస్కరణ' అని ఆయన పేర్కొన్నారు. అననుకూల పరిస్థితుల్లో ఎన్నికల్లో గెలిచినందుకు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపిలను ఆయన అభినందించారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర సాగిన ప్రాంతాల్లో కాంగ్రెస్ వోట్ల వాటా, సీట్ల సంఖ్య పెరిగినట్లు ఖర్గే తెలియజేశారు. 'భారత్ జోడో యాత్ర సాగిన చోట్ల కాంగ్రెస్ పార్టీ వోట్ల శాతం, సీట్ల సంఖ్య పెరగడం చూశామని మీ దృష్టికి తెస్తున్నా' అని ఆయన చెప్పారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను కూడా ఆయన అభినందించారు. ప్రతి పార్టీ వేర్వేరు రాష్ట్రాల్లో తనకు నిర్దేశించిన పాత్ర పోషించిందని, ప్రతి పార్టీ ఇతర పార్టీల విజయానికి తోడ్పడిందని ఆయన తెలిపారు. 'ఇండియా కూటమి కొనసాగి తీరాలని మన కృతనిశ్చయం. మనం పార్లమెంట్‌లోను, వెలుపల సంఘటితంగా, సమన్వయంతో వ్యవహరించాలి' అని ఆయన చెప్పారు. ఎన్నికల ప్రచారంలో లేవనెత్తిన సమస్యలు దేశ ప్రజలను వేధిస్తున్న సమస్యలు అని, కూటమి సభ్యులు పార్లమెంట్‌లోను వెలుపల వాటిని లేవనెత్తుతూనే ఉండాలని ఖర్గే స్పష్టం చేశారు. 'ఇంతకు ముందు శాసనసభ ఎన్నికల్లో మనం మెరుగైన ప్రదర్శన ఇచ్చి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో మన ప్రవర్తనను పునరావృతం చేయలేకపోయాం. అటువంటి ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక చర్చలను త్వరలో జరుపుతాం' అని ఆయన చెప్పారు. 'మనం సరిదిద్దే చర్యలు తీసుకోవలసి ఉంటుంది. అవి సాంప్రదాయకంగా కాంగ్రెస్‌కు అనుకూల రాష్ట్రాలు. మనకు అవకాశాలు ఉన్నచోట్ల మన ప్రయోజనం కోసం కాకుండా మన ప్రజల ప్రయోజనార్థం మనం కృషి చేయవలసి ఉంటుంది. ఈ ప్రక్రియను నేను త్వరలోనే నిర్వహించాలని ప్రతిపాదిస్తున్నాను' అని కాంగ్రెస్ అధ్యక్షుడు చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా '24 గంటలూ, 365 రోజులూ' ప్రజల మధ్యే పార్టీ కృషి సాగుతూనే ఉంటుంది. సమస్యలను లేవదీస్తూనే ఉంటుంది' అని ఆయన తెలిపారు. అవిశ్రాంతంగా పని చేస్తున్నందుకు పార్టీ నేతలు, కార్యకర్తలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన ముఖ్యంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పేర్లను ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ మణిపూర్‌లోని రెండు సీట్లను గెలుచుకుందని ఆయన తెలియజేస్తూ, పార్టీ నాగాలాండ్, అస్సాం, మేఘాలయలో కూడా సీట్లు నెగ్గిందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీ వోటర్ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లోను, గ్రామీణ ప్రాంతాల్లోను సీట్ల సంఖ్యను పార్టీ పెంచుకుందని ఖర్గే తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా పార్టీ తన ఉనికిని చాటుకోవలసి ఉంటుందని ఖర్గే సూచించారు.

## 3 రాష్ట్రాలు.. 3 పరాజయాలు

హైదరాబాద్: పాలితులతో పాలకులు ఎంతగా మమేకమైతే అంతగా ఆదరణ ఉంటుంది. అధికారంలో ఉన్నా లేకున్నా ప్ర జలు అలాంటి పాలకులను గుండెల్లో చిరకాలం చిరస్మరణీయంగా ఉం చుకుంటారు. చరిత్ర పుటల్లో కూడా వారి పేరు చెక్కుచెదరకుండా ఉం టుంది. కాని పాలకులు, పాలితులకు దూరమైతే ఎలా ఉ ంటుందో, పా లకులకు పాలితులకు మధ్య అధికారులు సైంధవుల్లా రాజ్యాంగేతర శ క్తుల్లా మారి అధికారం చెలాయిస్తే ఎలా ఉ ంటుందో ఇటీవల మూడు ప్రభుత్వాల పతనాలు నిరూపించాయి. తాజాగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైఎస్ఆర్‌సిపి అధినేత జగన్ రెడ్డి పతనం వెనుక



అధికారులే కీలక పాత్ర వహించారని, వారు సిఎంఒ కార్యాలయంలో రాజ్యాంగేతర శక్తులుగా మారి మంత్రులు, ఎంఎల్‌ఎలకు, ప్రజలకు సిఎంను దూరం చేశారని దాని ఫలితమే జగన్ ఓటమి అంటూ ఆ పార్టీకి చెందిన మాజీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సంచలనంగా వ్యాఖ్యానించారు. సిఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఏమి జరుగుతుందో, ప్రజల నిజ సమస్యలేమిటో తెలియకుండా సిఎంఒలో ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి అడ్డుగోడలు సృష్టించారని రాజా సంచలనంగాబాంబు పేల్చారు. సిఎంఒలో అదనపు కార్యదర్శిగా పని చేసిన కె. ధనుంజయ రెడ్డి సిఎంకు, ప్రజలకు మధ్య పాతాళమంతా అగాథం సృష్టించారని, దీనితో జగన్ మోహన్ రెడ్డి అవమానకరమైన ఓటమిని చవిచూశారని దీనికి ఆ అధికారే కారణమని కూడా రాజా నిందించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి ధనుంజయ రెడ్డి సమైక్య రాష్ట్రంలో నాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో కీలక అధికారిగా ఎన్నో శాఖల్లో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నిజానికి ఆయన సర్పంచ్ స్థాయి నుంచి ఐఎఎస్‌గా ఎదిగి ఆ తర్వాత పాలకులకు విశ్వసనీయ అధికారిగా జగన్ పాలనలో సిఎంఒ అదనపు కార్యదర్శిగా పని చేసి చివరి సమయంలో విమర్శల పాలు కావలసివచ్చింది.
రాజా చేసిన వ్యాఖ్యలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఆ రాష్ట్రంతో పాటు ఒడిశాలో అధికారం కోల్పోయిన నవీన్ పట్నాయక్, ఐదు నెలల క్రితం సిఎం పదవిని చేజార్చుకున్న కెసిఆర్ సిఎంఒ కార్యాలయానికి కూడా వర్తిస్తాయని ఈ మూడు రాష్ట్రాల అధికార, అనధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
అధికారంలో ఉన్నప్పుడు సిఎంఒ కార్యాలయాలు బ్యూరోక్రాట్ల పాలనకు నిలయంగా మారకూడదు. అవి ప్రజలకు, వారి తరపున ప్రతినిధులుగా ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు మధ్య వారధిలా ఉండాలి. ఈ అధికారులు సిఎంఒకు కళ్ళు, చెవులుగా ఉ ండడమే కాకుండా ప్రజలతో నిత్య సంబంధాలున్న ప్రజా ప్రతినిధులకు కూడా అందుబాటులో ఉండాలి, వారికి సిఎంను కూడా అందుబాటులో ఉంచాలి. అప్పుడే ప్రజాక్షేత్రంలోని అసలు సమస్యలు, పాలనలో మంచి చెడులు అధినేత దృష్టికి వస్తాయి. తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఏర్పడుతుంది. కాని ఈ అధికారులు సూపర్ పవర్లుగా మారి ప్రజా ప్రతినిధులకు కూడా అధినేతలను కలిసే అవకాశం కల్పించకపోవడంతో సిఎంలు అధికారం కోల్పోవలసి వస్తుందని రాజా వ్యాఖ్యలను సమర్థిస్తున్న ప్రజాప్రతినిధులు, కొందరు రిటైర్డు అధికారులు అంటున్నారు. ఒడిశాలో 24 ఏళ్ళుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించిన నవీన్ పట్నాయక్ పదవీచ్యుతుడు కావడానికి కూడా అక్కడ ప్రైవేటు సెక్రటరీగా పని చేసిన వికె పాండ్యన్ కారణమని రాజకీయ, అధికార వర్గాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రచారం జరుగుతున్నది. వికె పాండ్యన్ గడిచిన కొన్ని సంవత్సరాలుగా సూపర్ సిఎంగా వ్యవహరించారని, పరిపాలనలో సిఎంకు, ఇతర ప్రజా ప్రతినిధులకు మధ్య గ్యాప్ పెంచారని అక్కడ ప్రస్తుతం విజయ దుందుభి మోగించిన బిజెపి వర్గాలు ఎన్నికల్లో దీన్నే ప్రధాన ప్రచార అస్త్రంగా వాడుకున్నాయని అంటున్నారు. చివరకు నవీన్ పట్నాయక్ ఈ ఈ ఆరోపణలను ఖండించినా ప్రజలు విశ్వసించకుండా ఆయనను అధికారానికి దూరం చేశారు. తమిళనాడుకు చెందిన వికె పాండ్యన్ నవీన్ పట్నాయక్‌కు పదిహేనేళ్లుగా కుడిభుజంగా పని చేశారు. పాలనలో ఎన్నో సంస్కరణలకు ఆద్యుడుగా నిలిచారు. అయితే నవీన్ పట్నాయక్‌కు కుటుంబం లేకపోవడంతో పాండ్యన్ సిఎంఒకు ఆయనే అన్నీ తానై వ్యవహరించి దేశవ్యాప్తంగా వివాదాస్పద అధికారిగా నిలిచారు. భారత రాష్ట్ర సమితి అధినేత కెసిఆర్ హయాంలో కూడా సిఎంఒలో కార్యదర్శిగా పని చేసిన రాజశేఖర్ రెడ్డి వ్యవహార శైలిపై కూడా ప్రస్తుతం రాజకీయ అధికార వర్గాల్లో దుమారం రేగుతున్నది. రాజశేఖర్ రెడ్డి కూడా కెసిఆర్‌ను ప్రజా ప్రతినిధులకు దూరం చేశారని, ఏనాడు వారు ప్రజా సమస్యలతో ప్రగతి భవన్‌కు వస్తే వారిని కెసిఆర్‌తో కలిసే అవకాశం కల్పించే వారు కాదని మాజీ ఎంఎల్‌ఎలు అంటున్నారు. తమ అధినేతను కలిసే అవకాశం నిరాకరించడమే కాకుండా అపాయింట్‌మెంట్ పేరిట గంటల తరబడి నిరీక్షణకు గురి చేసేవాడని వారు చెబుతున్నారు. అధినేత భేటీకి ఈ అధికారే అడ్డుగా మారడంతో తమ సమస్యలే కాకుండా ప్రజా క్షేత్రంలోని నిజ సమస్యలు కూడా సిఎం దృష్టికి చేరేవి కాదని ఫలితంగా ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా అధికారం కోల్పోవలసి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి సిఎం కెసిఆర్‌కు నీడలా ఉండేవారు. ఆయన కేంద్రంలో మంత్రిగా పని చేసినప్పుడు కూడా రాజశేఖర్ రెడ్డి కెసిఆర్ పేషీలో నిర్ణయాత్మక పాత్ర వహించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కెసిఆర్‌కు చివరి దాకా వెన్నంటి ఉన్నారు. కాని ఇప్పుడు ఆయన వ్యవహార శైలిపై పలు రకాలుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ మూడు ప్రభుత్వాల పతనానికి సిఎంఒ అధికారుల వివాదాస్పద పాత్రనే పూర్తిగా కారణం కాకున్నా అనేక కారణాల్లో ఇదే బలమైన కారణమని వారు ఎన్నో సంఘటనలు ఉదహరిస్తూ చెబుతున్నారు.